1 St Year Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక



Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 66 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 09 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 66 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Monday 09 February 2026 PAGES : 8 PRICE : 3/-

# విశ్వ విజేతగా భారత్...

## ముచ్చటగా మూడోసారి టి 20 ప్రపంచ కప్ గెలిచిన భారత్...సమిష్టిగా ఆడిన భారత్ ఆటగాళ్లు...

**ఒక్క విజయం... ఎన్ని రికార్డులో!**

**న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ విజయంతో టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్**

**టీ20 చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన తొలి జట్టుగా రికార్డు**

**సొంతగడ్డపై వరల్డ్ కప్ గెలిచిన మొదటి ఆతిథ్య దేశంగా టీమిండియా చరిత్ర**

**మొత్తం మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన ఏకైక జట్టుగా అవతరణ**

**టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో 8 మ్యాచ్‌లలో 7 విజయాలు నమోదు**

భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరులో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసిన భారత్, విశ్వవిజేతగా నిలిచింది. 2023లో ఇదే మైదానంలో ఎదురైన పరాజయాల తాలూకు చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, లక్షలాది మంది అభిమానుల సాక్షిగా టీమిండియా విజయకేతనం ఎగురవేసింది. ఈ విజయంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం సంబరాలతో మార్మోగిపోయింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గానే కాకుండా, ఫేవరెట్‌గా బరిలోకి దిగి అంచనాలను నిజం చేసింది.

ఒకే విజయంతో మూడు రికార్డులు

ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపు ద్వారా టీమిండియా ఒకేసారి మూడు అరుదైన మైలురాళ్లను అధిగమించింది.

1. టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టు:

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టూ వరుసగా రెండుసార్లు కప్పు గెలవలేదు. 2024లో ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు 2026లో కూడా టైటిల్ గెలిచి, టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి పురుషుల జట్టుగా రికార్డు సృష్టించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో తమకు తిరుగులేదని నిరూపించుకుంది.

2. సొంతగడ్డపై గెలిచిన తొలి ఆతిథ్య జట్టు:

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఉన్న ఓ పెద్ద సెంటిమెంట్‌ను భారత్ బద్దలు కొట్టింది. 2007లో టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఆతిథ్య దేశం కూడా సొంతగడ్డపై కప్పు గెలవలేదు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి జట్లు ఆతిథ్యం ఇచ్చినా కప్పును ముద్దాడలేకపోయాయి. కానీ 10వ ఎడిషన్‌కు శ్రీలంకతో కలిసి ఆతిథ్యం ఇచ్చిన భారత్, సొంతగడ్డపై కప్పు గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.

3. మూడుసార్లు విశ్వవిజేతగా:

ఈ విజయంతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సార్లు వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2007లో ధోని సేన తొలి కప్పు గెలవగా, 2024లో రెండోసారి, ఇప్పుడు 2026లో మూడోసారి టైటిల్ సాధించి 'హ్యాట్రిక్' కొట్టింది. వెస్టిండీస్, ఇంగ్లండ్ చెరో రెండుసార్లు గెలవగా, భారత్ మూడు టైటిళ్లతో అందరికంటే ముందుంది.

జైత్రయాత్ర సాగిందిలా...

ఈ టోర్నీలో భారత జట్టు ప్రయాణం ఆ ద్యంతం ఆసక్తికరంగా సాగింది. మొత్తం 8 మ్యాచ్‌లలో ▶ మిగతా 2లో




## ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్.. వివరణ ఇవ్వాలని ఆదేశం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 08)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తికి కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ లేఖ రాశారు. అందులో కేంద్రం కొన్ని అంశాలను ప్రస్తావించింది.

రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎందుకు హాజరు కాలేదు?

రాష్ట్రపతి కోసం ఏర్పాటు చేసిన వాష్ రూమ్‌లో నీళ్లు లేవు.

రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్లే దారి చెత్తతో నిండిపోయింది.

డార్జిలింగ్ జిల్లా మేజిస్ట్రేట్, సిలిగుడి పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయండి.

బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం

అంతర్జాతీయ సంతాల్ సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్రపతి ముర్ము పశ్చిమ బెంగాల్ వెళ్లారు. అయితే ఆ సదస్సుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో.. చివరి నిమిషంలో మరోచోటికి మార్చారు. దీంతో కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే అక్కడికి వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతిని స్వాగతించేందుకు సీఎం, మంత్రులు రావాల్సి ఉండగా రాలేదు. దీనిపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అన్ని హద్దులు దాటిందంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చుతాం




(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 08)

మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చిన నేత ఎన్టీఆర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలు బాగా చదువుకోవాలని ప్రత్యేక విశ్వవిద్యాలయం తెచ్చారని చెప్పారు. రాజధాని అమరావతిలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ఇప్పుడు అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ సంపాదిస్తున్నారు. డ్వాక్రా, మెప్మా వల్ల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఇప్పటికే లక్ష దాటారు. తీసుకున్న రుణాలను సమయానికి బ్యాంకులకు చెల్లిస్తున్నారు. తెలుగు మహిళలు ఏ పని తలపెట్టినా.. సాధించే వరకు వదలరు. అప్పులు ఇప్పించే బాధ్యత నాది.. సద్వినియోగం ▶ మిగతా 2లో

## మనీ లాండరింగే జగన్ మద్య నిషేధం అసలు కథ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 08)

రూ.3,500 కోట్ల మనీ లాండరింగే 2019లో జగన్ చెప్పిన మద్య నిషేధం వెనుక ఉన్న అసలు కథ అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. అక్రమ మద్యంతో వేల కుటుంబాల్ని జగన్ నాశనం చేశారని, అనుచరులకు రూ.వేల కోట్లు దోచిపెట్టారని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రజలకు ఏం సమాధానం చెబుతారంటూ జగన్‌ను నిలదీశారు. మౌనమే మీకు రక్షణా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది

పీవీఎన్ మాధవ్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 08)

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు.సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రొటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. ▶ మిగతా 2లో

## ఎవరినీ నొప్పించని చిరునవ్వుల సభాపతి

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ప్రధాని మోదీ కితాబు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,మార్చి 08)

'అధికార పార్టీ పక్షపాతి' అంటూ విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మరో రెండు రోజుల్లో లోక్‌సభలో చర్చకు రానున్న నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. 'పార్టీల కతీతంగా పనిచేసే అద్భుతమైన సభాపతి. కొందరు సభ్యులు మాట వినకుండా ఇబ్బంది పెట్టినా మోముపై చిరునవ్వు చెరగనివ్వరు. ఎంపీలు అందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తారు' ▶ మిగతా 2లో

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం



**ప్రొటోకాల్‌ను పట్టించుకోని మమత సర్కారు**

**విమానాశ్రయానికి రాని ముఖ్యమంత్రి, మంత్రులు**

**ముర్ము అసహనం.. నివేదిక సమర్పించాలని ఆదేశం**

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,మార్చి 08)

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పశ్చిమ బెంగాల్‌లో చేదు అనుభవం ఎదురైంది. శనివారం ఆమె పాల్గొనాల్సిన 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో చివరిక్షణంలో వేరేచోటుకు దానిని మార్చాల్సి వచ్చింది. దాంతో ప్రతినిధులు అతికొద్ది సంఖ్యలోనే అక్కడకు చేరుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం తనను స్వాగతించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు రావాల్సి ఉండగా ఒకేఒక్క మేయర్‌ను పంపడంపై ముర్ము అసహనం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై నివేదిక పంపాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. బాగ్‌డోగ్రా విమానాశ్రయం సమీపంలో ఆదివాసీ సదస్సును ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. "నాకు స్వాగతం పలకడానికి ముఖ్యమంత్రి రావాలి. కానీ రాలేదు. గవర్నర్ బదిలీ అయినందువల్ల ఆయనా రాలేదు. ఇక్కడికి వచ్చినందుకు మీకు (ప్రతినిధులకు) ధన్యవాదాలు. ముందు అనుకున్నట్లు బిధాన్‌నగర్‌లో కార్యక్రమం జరిగిఉంటే బాగుండేది" అంటూ రాష్ట్రపతి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "మమత నా చెల్లిలాంటివారు. నేనూ బెంగాల్ పుత్రికనే. మరి నేను రావడాన్ని ఎందుకు అనుమతించలేదో అర్థం కావట్లేదు" అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ▶ మిగతా 2లో

## పిఆర్‌సి కమిషన్ వేసి 30% మధ్యంతర భృతి చెల్లించాలి

### ఏపియుఎస్ డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం స్థానిక ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం అందు జిల్లా అధ్యక్షులు కే మల్లికార్జున్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ సంఘం నియమిస్తూ 30% ప్రకటించాలని కోరారు. 2023 జూలై నాటికి పిఆర్సి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ నేటికీ కమిషన్ వేయకపోవడం మధ్యంతర భృతి చెల్లించకపోవడం నాలుగు డిఏలు పెండింగ్ ఉండటం పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనను వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నుండి మినహాయింపు ఇప్పించడానికి ఏబిఆర్ఎస్ఎం ద్వారా (జాతీయ ఉపాధ్యాయ సంఘం) కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని తప్పనిసరిగా మినహాయింపు లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్షనల్ హాలిడేస్ విషయంలో ఒక్కొక్క పండుగకు ఒక్కొక్క విధంగా ప్రకటిస్తుందని ఆప్షనల్ సెలవులు గతంలో మాదిరిగా పాఠశాల వారీగా విద్యార్థులకు కూడా ప్రకటించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా జరగాలని, ఎటువంటి పోస్టులను బ్లాక్ చేయరాదని రాబోవు డీఎస్సీ ద్వారా ఖాళీలన్నీ నింపాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి. దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్ విద్యార్థులలో, ఉపాధ్యాయులలో తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నారు. ప్రతిరోజు పరీక్ష అనేది విద్యార్థులకు చాలా కష్టతరంగా ఉందని అన్నారు. సోషల్ మీడియాలో ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు వ్యవహరిస్తున్న విషయాలను ట్రోల్ చేస్తూ ఉండడం శ్రేయస్కరం కాదని తెలిపారు. సమావేశానికి హాజరైన ఉపాధ్యాయ సంఘం బాధ్యులు అనేక విషయాలు చర్చించి, ప్రభుత్వం ఆర్థిక బకాయిల పట్ల ఉదాసీనతతో వ్యవహరించడం వేదనకు గురి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు కే శ్రీనివాసరావు, కె వెంకట్‌రెడ్డి, డి శేషగిరిరావు, ఎంఎంఎస్ ఆంజనేయులు, టి శేషారావు, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మార్చి 08)

తర్లుపాడు శాఖా గ్రంథాలయం నందు ఆదివారం గ్రంథ పాలకులు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళలు అయిన భారతరత్న, పేదల పెన్నిధి స్వర్గీయ మదర్‌థెరిసా, భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ, స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ ఝాన్సీ లక్ష్మీబాయి, స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ కస్తూర్బా గాంధీ, తెలుగు కవయిత్రి శ్రీశ్రీశ్రీ కుమ్మెర మొల్ల, తదితర మహిళామణులను స్మరించుకుంటూ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చుతాం

చేసుకునే పని మీది. స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే బాధ్యత నాది. మీరు చేసిన ప్రతి వస్తువుకు మంచి ధర వచ్చేలా చూస్తాం. ప్రతి ఇంట్లో స్వయం బ్రాండ్ ఉత్పత్తులే వాడాలి. ఈ ఏడాది మరో 5 లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. డ్వాక్రా, మెప్మాలో 1.1 కోట్ల మంది సభ్యులున్నారు. మీరు తయారు చేసే ఉత్పత్తులు దేశవ్యాప్తంగా విస్తరించాలి. మా ఇంట్లో కూడా ఇద్దరు మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేశాం. నా భార్య, కోడలు సమర్థంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ మహిళా వ్యాపారవేత్త ఉండాలి. ఆడబిడ్డల రక్షణ విషయంలో మాత్రం రాజీ లేదు. దుర్మార్గులను అరికట్టాల్సిన బాధ్యత కూడా మీదే. మహిళల జోలికి వస్తే అదే వారికి చివరిరోజు అవుతుంది. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో ఎవరికీ వ్యాధులు రాకుండా చూసుకునే బాధ్యత మీదే. సమాజంలో వచ్చిన మార్పుల వల్ల జనాభా తగ్గిపోతోంది. జనాభా తగ్గితే అనేక ప్రమాదాలు వస్తాయి. పెద్ద కుటుంబంతో మనకు రక్షణ, భద్రత, ఆనందం. ప్రభుత్వ పథకాలన్నీ పెద్ద కుటుంబాలకే అందేలా చూస్తాం. ఇప్పుడు 58శాతం మంది ఒక్క బిడ్డకే పరిమితం అవుతున్నారు. రాష్ట్ర ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలి. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో సుపరిపాలన ఉండాలి. మనకు డబ్బు సమస్య కాదు.. ఆలోచనా విధానమే ముఖ్యం. మీ పరిధిలో ఉన్న విషయాల్లో తప్పు చేయకుండా ముందుకెళ్లాలి. ఇంటా, బయటా చిన్న చిన్న సమస్యలు వచ్చాయని వెనక్కి తగ్గవద్దు. ఇప్పుడు ప్రతి పథకం మహిళల పేరుతోనే ఇస్తున్నాం. ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా ఉండాలి. తగాదాలు రాకుండా చూడాలి. ఇప్పుడు ఇళ్లలో ఎవరూ మాట్లాడుకోవడం లేదు. అందుకే సమస్యలు. ఫోన్ ఎక్కువగా చూసినా మానసిక సమస్యలు వస్తాయి. స్మార్ట్ ఫోన్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఫోన్ ఎక్కువగా చూడకుండా భర్త, పిల్లలను మీరే కంట్రోల్ చేయాలి." అని చంద్రబాబు సూచించారు.

## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది

దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

## ఎవరినీ నొప్పించని చిరునవ్వుల సభాపతి

అంటూ మోదీ కితాబునిచ్చారు. కోటా విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ శనివారం వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ..'ఓం బిర్లా రాజ్యాంగానికి అంకితమైన వ్యక్తి. పార్లమెంటరీ విధానాలకు పూర్తి విధేయుడు' అని తెలిపారు. లోక్‌సభలో ఓంబిర్లాను చూసినప్పుడల్లా విద్యావంతుల నగరమైన కోటా ప్రభావం ఆయనపై ఉందనిపిస్తుందని మోదీ పేర్కొన్నారు.

**స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి టీఎంసీ మద్దతు**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతినిస్తున్నట్లు తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ అధికారికంగా ప్రకటించింది. రెండో విడత బడ్జెట్ సమావేశాల తొలి రోజైన సోమవారం స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం లోక్‌సభలో చర్చకు రానుంది. సభా నిర్వహణలో ఓం బిర్లా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ 118 మంది ప్రతిపక్ష ఎంపీలు ఈ తీర్మాన నోటీసును సమర్పించారు. ఈ తీర్మానంపై సంతకం చేయని టీఎంసీ...ఇప్పుడు తన వైఖరి మార్చుకుంది.

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం

**బెంగాల్ అన్ని హద్దులు దాటింది: మోదీ**

రాష్ట్రపతి ముర్ము అసహనానికి కారణమైన ఘటనలపై ప్రధాని మోదీ స్పందించారు. తృణమూల్ సర్కారు అన్ని హద్దులను దాటిందని, ఈ ఘటనకు అది బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమైందని, ఎప్పటికీ గౌరవించాలని హితవు పలికారు.

**రాష్ట్రపతి రాజకీయం చేస్తున్నారు: మమత**

ఎన్నికల ముందు భాజపా సలహా మేరకు రాష్ట్రపతి ముర్ము రాజకీయం చేస్తున్నారని మమతా బెనర్జీ కోల్‌కతాలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కించపరిచేందుకు రాష్ట్రపతి పదవిని భాజపా వాడుకుంటోందని ఆరోపించారు. ఆమె ఏడాదికి ఒకసారి వస్తే స్వాగతం పలుకుతానని, ఎన్నికల సమయంలో పదేపదే పర్యటనకు వస్తే అది సాధ్యం కాదని తెగేసి చెప్పారు. మణిపుర్‌లో గిరిజనుల పరిస్థితిపై ఆమె ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

## విశ్వ విజేతగా భారత్...

7 విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై 29 పరుగుల గెలుపుతో భారత్ తమ వేటను ప్రారంభించింది. అనంతరం ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాను 93 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61 పరుగుల భారీ విజయం సాధించి అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌పై 17 పరుగుల తేడాతో గెలిచింది.

అయితే, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోనే దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఏకైక పరాజయం ఎదురైంది. కానీ ఈ ఓటమి నుంచి వెంటనే తేరుకున్న టీమిండియా, ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

**అక్టోబర్ 2023 నుంచి తిరుగులేని ఫామ్**

టీమిండియా ఈ టోర్నీకి ముందు నుంచే అద్భుతమైన ఫామ్‌లో ఉంది. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకు ఆడిన గత 56 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఏకంగా 48 విజయాలు నమోదు చేయడం విశేషం. వరల్డ్ కప్‌కు ముందు న్యూజిలాండ్‌పై సిరీస్ గెలిచి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన భారత్, ఫైనల్ పోరులో అదే జట్టును చిత్తుచేసి విశ్వవిజేతగా అవతరించింది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా, టీ20 క్రికెట్‌లో ఒక సామ్రాజ్యాన్ని స్థాపించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.?

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది: పవన్ కల్యాణ్

**డార్జిలింగ్ సంతాల్ సదస్సు నిర్వహణ తీరుపై పవన్ కల్యాణ్ స్పందన**

**రాష్ట్రపతి ఆవేదన భరిత వ్యాఖ్యలు తనను బాధించాయన్న డిప్యూటీ సీఎం**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 08)

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సంతాల్ సదస్సు' నిర్వహణ తీరు, అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణా మాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు.

## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే మహిళలకు నారా లోకేశ్ శుభాకాంక్షలు

**మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్**

**ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 08)



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనియాడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. "అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగి నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది" అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి', 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు.

# అవోప ఆధ్వర్యంలో నిరుపేద వైశ్యులకు వస్త్రాలు వితరణ


## పత్తి వెంకటసుబ్బయ్య సహకారంతో వస్త్రాలు వితరణ

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 08)

బద్వేల్ పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత శ్రీనివాస ట్రేడర్స్ అధినేత పత్తి వెంకటసుబ్బయ్య అనేక సంవత్సరాలుగా బద్వేల్ ప్రాంతంలోని నిరుపేద ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని ఉగాది పండుగ పురస్కరించుకొని ముందస్తుగా ప్రతి ఒక్కరికి ఖరీదైన వస్త్రాలను వితరణ చేయడం సంతోషకరమని ఆవోపాకమిటి అధ్యక్షులు నూకల రెడ్డయ్య, సెక్రటరీ సివి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆవోప వారి ఆధ్వర్యంలో వృద్ధులకు పెన్షన్ కార్యక్రమం ఉగాది పండుగను దృష్టిలో పెట్టుకుని వస్త్రాల పంపిణీ అలాగే ప్రతి నెల వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెడికల్ క్యాంపు మహిళా దినోత్సవ వేడుకలను ఉచిత మందుల పంపిణీ, అలాగే స్వర్గీయ పత్తి పద్మావతి కుటుంబ సభ్యులు,



రాయవరం సురేష్ బాబు కుటుంబ సభ్యుల సహకారంతో పెన్షన్ కార్యక్రమానికి విచ్చేసిన పలువురికి అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పెన్షన్ దారులకు ఉగాది పర్వదినాన్ని దృష్టిలో పెట్టుకుని వస్త్రాల పంపిణీ చేసిన పత్తి వెంకటసుబ్బయ్య సతీమణి శ్యామలమ్మ కుటుంబ సభ్యులు పలువురికి వస్త్రాలు అందజేశారు. తదనంతరం హైదరాబాదుకు చెందిన రెక్సర్ ఫార్మా కంపెనీ అధినేత మదనపల్లి సూర్య మోహన్ కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే డాక్టర్ బి శివాని డాక్టర్ ఆర్ఎస్ పూజిత ఆధ్వర్యంలో ఉచిత హోమియో క్యాంపును ఏర్పాటు చేసి మందులను అందజేయడం జరిగింది. బద్వేల్ ఆవోప అధ్యక్షులు నూకల రెడ్డయ్య ప్రధాన కార్యదర్శి సివి నాగేశ్వరరావు ఆర్థిక కార్యదర్శి తులసి సుబ్రహ్మణ్యం మహిళా విభాగం అధ్యక్షురాలు సుధామణి, సునీత, స్వర్ణ, అవోపా సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలు అందించినటువంటి ఆర్యవైశ్య మహిళలకు శాలువాలతో సత్కరించారు. కొండపల్లి దేవి, శ్రద్దవతి లలిత, దేవతి లక్ష్మీ, చింతకుంట ధనలక్ష్మి, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మకి ఘనంగా మహిళా దినోత్సవ సత్కారాలను బద్వేల్ అవోపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు మహిళలకు ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆవోపా కమిటీ, మహిళా మండలి, వాసవి, వనిత క్లబ్, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

09.03.26    సోమవారం


# మహిళా సంక్షేమంలో ఏపీ నెం 1



- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- స్త్రీల ఆర్థిక అభ్యున్నతి సృష్టికర్త సీఎం చంద్రబాబు
- ఉచిత బస్సు పథకం ఎన్నికల వాగ్దానం కాదు
- మహిళలకు రూ.150 కోట్ల రుణాలు పంపిణీ
- వైసిపి అస్తవ్యస్త విధానాలను సరిచేస్తున్నాం
- రెండు మూడు నెలల్లో 80% రోడ్లు పూర్తి చేస్తాం
- స్వాతంత్రం వచ్చిన తర్వాత 100 కిలోమీటర్లు వేస్తే
- 2014-15లో 475 కిలోమీటర్ల రోడ్లు నిర్మాణం చేశా
- భారీగా హాజరైన మహిళలు, కేక్ కటింగ్

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 08)**

మహిళల సంక్షేమం, సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలపర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆదివారం చిన్నగంజాం జిల్లా పరిషత్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఏలూరి సాంబశివరావు హాజరై ప్రసంగించారు. మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. స్త్రీ లేకుండా సృష్టి లేదని, కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక మహిళ సాధికారత పొందితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం ముందుకు సాగుతుందని వివరించారు.

**మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు**

మహిళల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ఏలూరి గుర్తుచేశారు. మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించి వారి ఆత్మగౌరవాన్ని పెంచారని అన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన పార్టీ కూడా తెలుగుదేశం పార్టీయేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను కుటుంబ పరిమితుల్లో మాత్రమే కాకుండా ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా నిలబెట్టాలని సంకల్పంతో పనిచేస్తున్నారని తెలిపారు.

**మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు....**

డ్వాక్రా మహిళల రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లను నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఇప్పటికే 45 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందారని వివరించారు. వంటింటి భారాన్ని తగ్గించేందుకు 3 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తూ 5 వేల మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా అప్గ్రేడ్ చేసినట్లు తెలిపారు.

**గృహాలు, ఉపాధికి ప్రాధాన్యం....**

మహిళలకు ఇప్పటికే 3 లక్షల ఇళ్లు అందించామని, రాబోయే ఉగాది నాటికి మరో లక్ష గృహప్రవేశాలు జరగనున్నాయని తెలిపారు. మహిళల స్వయం ఉపాధి కోసం లక్ష కుట్టు మిషన్ల పంపిణీకి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కుప్పంలో విద్యార్థినులకు 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించినట్లు తెలిపారు. మహిళలపై నేరాలు తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు.

**గ్రామాభివృద్ధికి భారీ నిధులు....**

గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామని, రెండు నుంచి మూడు నెలల్లో 80 శాతం పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. 2014 19 ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన కోట్లాది రూపాయల నిధులకు సంబంధించి పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి నిలిపివేసిందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల రోడ్డు పనులు నిలిచిపోయాయని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 100 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించబడగా, 2014-15లోనే 475 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు ప్రధానంగా మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా రోడ్లు డ్రైన్లకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు.

**మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా....**

ఐసిడిఎస్ డిఆర్డిఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలు కనులు పండుగ జరిగాయి. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నేతలను ఎమ్మెల్యే ఏలూరి ఘనంగా సన్మానించారు. అనంతరం డిఆర్డిఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రూ.150 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ చెక్కును అందజేశారు. ఐసిడిఎస్ డిఆర్డిఏ స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. పోషకాహారం వాటి ప్రాధాన్యత గురించి ఐసీపీఎస్ స్టాల్స్ ను ఎమ్మెల్యే ఏలూరి ఆసక్తికరంగా తిలకించారు. డి ఆర్ డి ఏ సహకారంతో కార్లు, టెంట్ సామాగ్రి, డీజే మైక్ సెట్టింగ్లను ఎమ్మెల్యే ఏలూరి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు పోద వీరయ్య, నాయుడు హనుమంతరావు, బాపట్ల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ , అధికార ప్రతినిధి ఆజాద్ ,నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, ఐసిడిఎస్ సిడిపిఓలు సులోచన ,సుభద్ర, ఏ పి యం అనురాధ, సుబ్బారావు ,రామకృష్ణ, మోహన్ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్
- మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత
- మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు
- రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు
- అనేక సంక్షేమ పథకాలు అములు చేస్తుంది
- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 08)**

సమాజంలోని మహిళలు అందరు సంతోషంగా ఉంటేనే ఆ కుటుంబాలు,సమాజం అంత సంతోషంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పేదరిక నిర్మూలన సంస్థ మరియు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపట్ల నియోజకవర్గం శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ లతో కలసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని మహిళలు అందరు సంతోషంగా ఉంటేనే ఆకుటుంబాలు,సమాజం అంత సంతోషంగా ఉంటుందన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన వంటి రంగాలలో మహిళలు ముందుకు రావడం వల్ల కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వాలు మహిళల సాధికారత (తరువాయి 4లో...)

# మహిళాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 08)**

మహిళాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్ వీ కే పి కళాశాల సమీపంలో ఉన్న సౌజన్య ఫంక్షన్ హాల్ లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ బి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కానీ ప్రస్తుతం మహిళలను అన్నీ రంగాల్లో రాణించారంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి పట్టుదల వల్లే సాధ్యపడిందన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు డ్వాక్రా గ్రూపులు, వంటగ్యాస్, వడ్డీ లేని రుణాలు, వివిధ శిక్షణ కార్యక్రమాలు ఇలా అన్ని రకాలుగా మహిళలను ఆదుకున్నది తెదేపా ప్రభుత్వ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి వారికి మరింత చేయూతనందించారని వివరించారు. ముఖ్యంగా ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా కలను నెరవేర్చి ఈ ప్రాంతంపై చెరగని ముద్ర వేసుకున్న ఘనత తమ నాయకుడు చంద్రబాబు నాయుడు దేనని కొనియాడారు. ఇటీవల మార్కాపురం వచ్చిన ఆయన ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా మారుస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంత వాసులు చిరకాల నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మార్కాపురం ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, దీంతోపాటు గ్రామాలు పట్టణాల్లో అభివృద్ధికి తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ హెచ్ పీ వీ వ్యాక్సినేషన్, ఐసిడిఎస్ సఖీ వన్ స్టాప్ సెంటర్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుముందు మహిళా దినోత్సవ (తరువాయి 4లో...)

# మహిళల భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

## రాష్ట్ర సాంఘీ, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 08)**



మహిళల భద్రతకు, వారి ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఒంగోలు నగరంలోని బృందావనం కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో నడిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. (తరువాయి 4లో...)

# రిజర్వాయర్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)**

కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు రిజర్వాయర్ వద్ద పెండింగ్లో ఉన్న పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఆదివారం ఆయన ఈ రిజర్వాయర్ ను పరిశీలించారు. ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. అబూత్ అలీం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి ఈ సందర్భంగా రిజర్వాయరుకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు వివరించారు. స్థానికులతోనూ ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయరుకు తరలించేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎత్తిపోతల, పైప్ లైన్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు రిజర్వాయర్ వద్ద కట్ట నిర్మాణ పనులు కొంతమేరకు పూర్తి కావాల్సి ఉందన్నారు. వీటి గురించి ముఖ్యమంత్రి వద జరిగిన సమావేశంలోనూ ప్రస్తావన వచ్చిందన్నారు. మొదట విడతలో ప్రభుత్వం రూ.35 కోట్లను బడ్జెట్లో కేటాయించిందన్నారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా (తరువాయి 4లో...)



# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి












కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో విజయాలు సాధించాలన్నారు. గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడుతున్నారని, ఈ సంఘాల ద్వారా చిన్న వ్యాపారాలు ప్రారంభించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకుంటున్నారని తెలిపారు. బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, అవసరమైన సమయంలో మహిళలు సహాయం కోసం ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు గారికి దక్కుతుందని తెలిపారు. ఉద్యోగాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఉందని రాజకీయలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్ లో బిల్లు పెట్టడం జరుగుతుదన్నారు. డ్వాక్రా మహిళలు ఎన్నో రకాల ఉత్పత్తులు తయారు చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మహిళా సమక్షేమానికి పెద్ద పేట ఇస్తున్నారని. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం,మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, డ్వాక్రా మహిళలకు వారి నైపుణ్యాన్నికి సంబంధించి వివిధ రకాల వస్తువులు తయ్యారి చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు రుణాలు అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వము మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అములు చేస్తున్నారు. అంతకుముందు డిఆర్డీఏ, మెప్మా, ఉద్యాన, వ్యవసాయ,మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ ల ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, జిల్లా ఎస్పీ,వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం 7677 మెప్మా యస్ హెచ్ జి మహిళలకు బ్యాంక్ లింకేజీ మరియు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.113 కోట్లు,52 లక్షలు 37 వేలు మెగా చెక్కును మరియు డిఆర్డీఏ ద్వారా 101283 మంది మహిళలకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి,ఉన్నతి,సి ఐ ఎఫ్ ద్వారా రుణాలు రూ.1165 కోట్లు 57 లక్షలు 37 వేలు మోగా చెక్కును మహిళ సంఘాల సభ్యుల కు అందజేశారు. వ్యవసాయ శాఖ ద్వారా ట్రాక్టర్ ను,వన్ స్టాప్ సెంటర్ కు కార్ ను ఆటోలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వివిధ రంగాలలో రాణించిన మహిళల సంఘాల ను మహిళలను మరియు మహిళ జిల్లా అధికారులను, ఘనంగా సాలవతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.గ్లోరియా, డిఆర్డీఏ,డ్వామా మెప్మా, మహిళ శిశు సంక్షేమ శాఖ ల పి డి లు, బి.సింగయ్య,విజయలక్ష్మి, ఆనంద పాల్,రాధమాదవి, డి యం&హెచ్ ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ,జి యం డి ఐ సి.రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, జిల్లా నైపుణ్య అభివృద్ధి మేనేజర్ మాధవి, డి సి హెచ్ ఎస్,డాక్టర్ పద్మావతి, పౌర సరఫరా డి యం శ్రీలక్ష్మి, తహశీల్దార్ షాక్ సలీమా, మహిళ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## రిజర్వాయర్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి





ఈ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో నష్టపరిహార, పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులను రెండు మూడు నెలల్లో పూర్తిచేసి, రిజర్వాయర్ కింద ఉన్న సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని ప్రకటించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆర్ రాజ్యలక్ష్మి, తహసిల్దార్ జివి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# మహిళాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం







సందర్భంగా అక్కడ ఆర్టీసీ, స్త్రీ శక్తి, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, మైక్రో ఇరిగేషన్, ఉద్యాన శాఖ ల వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులతో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరిశీలించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు వారు ప్రత్యేక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.ప్రభాకర్, డీఎస్పీ నాగరాజు, డి ఎం హెచ్ ఓ వాణిశ్రీ, ఐసిడిఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఏం సి చైర్మన్ వెంకటరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



















# మహిళల భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం





పలు సంక్షేమ పథకాలను కూడా ఈ దిశగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన మహిళలకు అత్యంత సురక్షితమైన నగరముగా విశాఖపట్నం నిలిచిందన్నారు. 14 ఏళ్లు పైబడిన బాలికలకు హెచ్. పి.వి. వ్యాక్సిన్ వేయించాలని మహిళలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ఆలంబనగా చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. రాజకీయంగానూ ముందడుగు వేసేలా చట్టసభల్లో 33% రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సాధికారత కోసం వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధి, సమాజ అభవృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళల ఆరోగ్యానికి భద్రతను ఇస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ కుటుంబంలో, సమాజంలో స్త్రీ పాత్రను, నిర్వహిస్తున్న బాధ్యతలను కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళలు ఈ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు. మంత్రి, ఇతర అతిథుల చేతుల మీదగా వీరు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వివిధ పథకాల కింద మెప్మా మహిళలకు రూ.18.60 కోట్లు, డిఆర్డిఏ మహిళలకు రూ.314.61 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.67.28 కోట్ల విలువైన బ్యాంకు చెక్కులను ఆర్థిక రుణం కోసం అందించారు. ఈ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ స్టాల్ ను కలెక్టర్ ప్రారంభించి అర్హూరాలైన బాలికకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేయించారు. మెప్మా, ఐసిడిఎస్, పోలీస్, డిఆర్డిఏ, ఏపీఎంఐపీ, బ్యాంకింగ్, పరిశ్రమలు, ఏపీఎస్ ఆర్టీసీ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఇతర అతిథులు వీక్షించారు. ఆయా శాఖల ద్వారా అందిస్తున్న పథకాల ప్రయోజనాలను అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. రాయితీ ద్వారా మంజూరైన ఒక ట్రాక్టర్, మూడు ఆటోలను ఈ కార్యక్రమంలో లబ్దిదారులకు మంత్రి, కలెక్టర్, ఎంపీ అందించారు. ఈ వేడుకలలో డీఆర్వో బి.చిన ఓబులేసు, డిఆర్డిఏ పిడి నారాయణ, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్.డీ.సి. కళావతి, ఎల్.డి.ఎం. రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ. అర్జున్ నాయక్, ఐసిడిఎస్ పి.డి. నాగమణి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మి, డీఎస్ఓ పద్మశ్రీ, ఒంగోలు డి.ఎస్.పి. శ్రీనివాసరావు, ఇతర అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కవిత, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం వేళ సాంబన్న ఉచిత కంటి వైద్య శిబిరం

**500 మందికి పరీక్షలు, 150 మందికి శస్త్రచికిత్సలు**
**ఆప్యాయంగా పలకరిస్తూ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సాంబశివరావు**
**నిరంతరం ఉచిత కంటి వైద్య శిబిరాలు**
**లక్ష మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలే లక్ష్యం**
**పేదల ఆరోగ్య వరప్రదాయని సీఎంఆర్ఎఫ్**
**కంటి వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ఏలూరి**







(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 08)
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం చిన్నగంజాంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి, నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ శిబిరానికి సుమారు 500 మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 150 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించి చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తూ లక్ష మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో వరప్రదాయిగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నగంజాం మండలంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నట్లు తెలిపారు.

# గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలి

## సిపిఎం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)
వంటగ్యాస్ సిలిండర్‌కు రూ.60లు, వాణిజ్య సిలిండర్ రూ.115లు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేసింది. సిపిఎం గాంధీనగర్ శాఖ, బలరాం కాలనీ శాఖల ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ బండలతో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి ,రష్యా నుండి ఆయిల్ కొనుగోలు పై ఆంక్షలు నేపథ్యంలో ధరలు పెరిగాయన్నారు. యుద్ధాన్ని ఖండించి నిలుపుదల చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని, ఆ భారాన్ని ప్రజలపై నెట్టడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి, సతమతమవుతున్న సామాన్యులపై వంటగ్యాస్ ధర పెంపు పెద్ద దెబ్బ అని అన్నారు. ఉపాధి కోసం తోపుడుబండ్లు ఇతర చిన్నచిన్న వ్యాపారాలతో పొట్ట గడుపుతున్న చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ ధర పెంపు తీవ్ర నష్టం కలిగిస్తుందని అంతేగాక అసంఘటన కార్మికులు స్వల్ప ఆదాయం కలిగిన వారు కొనుక్కునే టిఫిన్, ఇతర ఆహార పదార్థాలు ధరలు పెరుగుతాయని తెలిపారు. అన్ని విధాల ప్రజా జీవితాన్ని ఘోరంగా నష్టపరిచే గ్యాస్ ధర పెంపకం కేంద్ర ప్రభుత్వం తక్షణశీ ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మనగడకు ఆక్సిజన్ సమకూరుస్తున్న టిడిపి కూడా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా నాయకురాలు కే రాజలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మహిళల సమస్యల పరిష్కరించకపోగా మహిళల మీద భారవయ్యే గ్యాస్ ధరలు పెంచడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హుస్సేన్, పీరు, జబ్బారు, శ్రీనివాసరావు, గురవయ్య, టి సురేష్, గోవిందమ్మ, బివి రావు, కోమలి, ధనలక్ష్మి, టి దాసు, తదితరులు పాల్గొన్నారు. బలరాం కాలనీలో ఖాళీ సిలిండర్లతోపాటు కట్టెల పొయ్యి వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తంబి శ్రీనివాసులు, భూలక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.







# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మార్చి 08)
గిద్దలూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గిద్దలూరు యుటిఎఫ్ ప్రాంతీయ మండలాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరైన మహిళా ఉపాధ్యాయినీలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వి మాధవి దేవి అధ్యక్షత వహించారు. మాధవిదేవి మాట్లాడుతూ మహిళలు సాధికారిత సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారీతకు అనేక చట్టాలు చేస్తున్న అమలులో నిర్వీర్యం అవుతున్నాయన్నారు. మహిళల అక్షరాశ్యత 70 శాతం ఉండగా పురుషులు అక్షరాశ్యత 85 శాతం ఇక్కడే సమానత్వం లోపించిందన్నారు. లింగ వివక్ష, సమాన పనికి సమాన వేతనం, మహిళలపై హింస, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు తగ్గలేదన్నారు. దేశంలో అన్ని ఆలయాల్లోకి స్త్రీ లకు ప్రవేశం లేదు. కొందరు ముస్లిం మహిళలకు దర్గాలలోకి వెళ్లి ప్రార్థన చేసే హక్కు లేదు, పార్సీ మహిళలు వర్ణాంతర వివాహం చేసుకుంటే వాళ్ళ దేవుడైయినా అగ్ని దేవుని ఆలయం లోకి వెళ్ళడానికి లేదు. ఎక్కడ సమానత్వం అన్నారు. అనంతరం ఆటలల్లో గెలుపొందిన ఉపాధ్యాయినీలకు బహుమతులు ప్రధానం చేశారు. పాల్గొన్న ప్రతి ఉపాధ్యాయినికి గిఫ్ట్ ఇవ్వడం జరిగింది. త్వరలో పదవి విరమణ చేయనున్న ఉపాధ్యాయినీలకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల సంఘ బాధ్యతలు వి రంగ సుధా, పి నాగమణి, వై జయప్రద, రంగమ్మ, ఆర్ శ్రీదేవి, బి అనురాధ, బెనజీర్, యస్ జయప్రద, విజయ తదితర ఉపాధ్యాయినులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దేశ్వర శర్మ, రాష్ట్ర కౌన్సిలర్ పి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి యం పిచ్చయ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సిపిఎస్ కన్వీనర్ ఆవుల రాజు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రఘురాం, రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, హరిప్రసాద్, జయచంద్రారెడ్డి, ఈ వెంకటేశ్వర్లు, మస్తాన్, హకీం, జీవన్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 80 మంది మహిళా ఉపాధ్యాయినులు పాల్గొని జయప్రదం చేశారని జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలియజేశారు.



# వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 08)
ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న పెద్దారవీడు మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డిని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి, ఏరువ శేషసేనారెడ్డి, దోర్నాల మండల కన్వీనర్ రమణా రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, సర్పంచ్ ఆవులయ్య యాదవ్, నియోజకవర్గంలోని నాయకులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు పిజిఆర్ఎస్ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 08)
మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో స్పష్టంగా రాసుకొని ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు అందజేయాలని ఆయన కోరారు. జిల్లాలోని ప్రజలుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.


# సీనియర్ మహిళలకు ఘన సన్మానం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 08)
మండల కేంద్రమైన ఉలవపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు బాప్టిస్ట్ చర్చ్ మొదటి సర్వీసు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘంలో ఉన్న సీనియర్ మహిళలు అయినటువంటి ఈగ చిన్నమ్మ, బుజ్జమ్మ, అల్లాడి అన్నపూర్ణమ్మ లకు బొకే, శాలువాల తో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ జేమ్స్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# హెచ్‌పివి వ్యాక్సిన్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 08)




జిల్లా కేంద్రమైన మార్కాపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్‌పివి వ్యాక్సిన్ పోస్టర్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ సుజన, ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవం







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 08)**

ఆదివారం పట్టణంలోని సాయి బాలాజీ కళ్యాణమండపం నందు గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ సకల దేవతలు నివాసం ఉంటారు. ఈ సృష్టికి మూలం అమ్మ,అమ్మ లేకుంటే సృష్టే లేదు.అమ్మ కాదంటే మనకు జన్మేలేదు. అమృతానికి అర్పణం అసలు పేరు అమ్మ. అనుభూతికి ఆనవాళ్లు అమ్మ అని కొనియాడారు.

ఈ సందర్భంగా సభాధ్యక్షులు హారిక, యూత్ కన్వీనర్ అనూష మాట్లాడుతూ పెద్ద ఎత్తున హాజరైన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. తదుపరి చాకిరాల తేజశ్రీని బూదాటి సంపూర్ణమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు చిట్టెం శెట్టి వెంకట సుబ్బారావు గుంటక కృష్ణ అజయ్ బట్టు పిచ్చయ్య ఆళ్లచెరువు విక్రమార్క మహిళలు అంజనాదేవి చంద్రకుమారి లక్ష్మి కోటేశ్వరి అంజమ్మ దివ్య రేణుక సావిత్రి భార్గవి ఆదిలక్ష్మి లీలావతి రాజేశ్వరి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వక్తృత్వంలో ప్రతిభ చాటిన బాల విహార్ చిన్నారులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)**

చిన్నారులను తగిన విధంగా ప్రోత్సహిస్తే వారిలోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీస్తే వారు దేశం, ప్రపంచం మెచ్చుకునే మేధావులుగా గొప్ప ఆలోచనాశీలురుగా మేటి వక్తలుగా రూపొందుతారని శ్రీగిరి బాల విహార్ విద్యార్థులు రుజువు చేస్తున్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పలువురు విద్యార్థులు హనుమాన్ చాలీసాతో పాటు గోవింద నామాలను అప్పగించడంతో పాటు వీర నారీమణి ఝాన్సీ లక్ష్మీ బాయ్, భారత దేశానికి ఆ పేరు రావడానికి గల కారణాలను తెలియ చెప్పారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి విద్యార్థులను అభినందించారు. శ్రీవారి ప్రసాదాలను అంద చేశారు.

# దివ్యాంగుల కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## దివ్యాంగులైన మహిళలకు చీరల పంపిణీ
## చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 08)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కనిగిరి పట్టణంలోని దివ్యాంగుల కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పుర ప్రముఖులు పాల్గొని దివ్యాంగ మహిళలకు షిరిడి సాయిబాబా దేవస్థానాల జిల్లా చైర్మన్ దేవకి సుబ్రహ్మణ్యం, వైసిపి అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు ఐమోలు నాగమణిల సహకారంతో దివ్యాంగ మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల వేదిక మహిళా అధ్యక్షురాలు శ్రీరామలక్ష్మి సభ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళా అభ్యున్నతి కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాయని వాటిని మహిళలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలలో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వాల అందిస్తున్న తల్లికి వందనం పథకం మహిళలకు ఇవ్వడం ద్వారా కుటుంబ బాధ్యత మంచి వాతావరణానికి దోహదపడుతుందన్నారు. అనంతరం అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం గత ప్రభుత్వాలు ఎంతో పనిచేశాయన్నారు. తమ నాయకుడు దద్దాల నారాయణ యాదవ్ పిలుపుమేరకు మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం ప్రజా హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాల మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళా సాధికారత కోసం ఏర్పాటు చేసిన మహిళా బిల్లు పార్లమెంట్లో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉందన్నారు. మహిళలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని







తద్వారా మహిళలకు సమాజంలో ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి మహిళలందరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మహిళలకు నాయకులు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మున్సిపల్ ఏడవ వార్డు కౌన్సిలర్ దేవకి రాజీవ్, వైసిపి అంగన్‌వాడి విభాగం అధ్యక్షురాలు నాగమణి, షిరిడి సాయిబాబా దేవస్థానాల మాజీ చైర్మన్ దేవకి సుబ్రహ్మణ్యం, దివ్యాంగుల మహిళా సంఘం నాయకురాలు శ్రీరామలక్ష్మి, వికలాంగుల హక్కుల వేదిక కార్యదర్శి మైనర్ బాబు, మహిళా నాయకురాలు షకీలా, వెంకటలక్ష్మి, దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి

## సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి
## ఎం రమేష్ డిమాండ్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)**

అంగన్వాడీలు, ఆశాలు, వివో ఏలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్మికులు, ఆటో భవనిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని సిఐటియు ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ వలేటివారిపాలెం మండల కమిటీ, జనరల్ బాడీ సమావేశం ఆదివారం మండల కో కన్వీనర్ ఎస్‌డి గౌస్ బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి యం. రమేష్, సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ గతంలో స్కీం వర్కర్లు చేస్తున్న పోరాటాలు, ఎన్నికల సందర్భంగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు మీ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేతనాలను పెంచుతామన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. మాది ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు.ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల గడిచింది. ఆర్థికపరమైన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. విజయవాడలో అంగన్వాడీలు, ఆశాలు ఆందోళన చేస్తుంటే, వారి ఉద్యమాలపై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి దమనకాండ చేసిందన్నారు. స్కీం వర్కర్లకు వేతనాలు పెంచితే వాళ్ల బ్రతుకుల్లో మార్పు వస్తుందని, ప్రభుత్వానికి మరింతగా సహకారం అందిస్తారని పేర్కొన్నారు. వారి బ్రతుకు కు భరోసా కూడా ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా కార్మికులు స్కీం వర్కర్ల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం వారి వేతనాలకు కేటాయింపులు పెంచాలని కోరారు. లేనట్లయితే ఉద్యమ బాట తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు, సీఐటీయూ మండల కన్వీనర్ సాదు చెన్నకేశవులు, కో కన్వీనర్ ఎస్‌డి గౌస్ భాషా, సిఐటియు నాయకులు మంగి జక్రయ్య, దార్ల మాధవరావుతో పాటు అంగన్వాడీలు, విఓఏల నాయకులు పి సంపూర్ణ, కాకు చెంచులక్ష్మి, వి వరలక్ష్మి, నంబూరి పద్మ, రంగమ్మ, ఏ సుభాషిని, శారద, గుత్తా లలిత, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు పోలీస్ శాఖ అగ్ర ప్రాధాన్యం
### సీఐ రామకృష్ణ


**(షణ్ముఖ వెలుగు, గోపవరం, మార్చి 08)**




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బద్వేలు పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 'శక్తి యాప్'తో పాటు 112 అత్యవసర సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే నియంత్రణ గదికి సమాచారం చేరి, తక్కువ సమయంలోనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే విధంగా వ్యవస్థ అమలులో ఉందని తెలిపారు. మహిళల రక్షణకు 112, 1091, 181, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. యువతులు అపరిచితుల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫేక్ లింకులు, యూపీఐ, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా వేధింపులపై జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మొబైల్‌లో 'శక్తి యాప్' ఉంటే పోలీస్ రక్షణ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# స్వయంకృషి సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శ్రీ శక్తి పురస్కారాలు

## సీడీపీవోలు షేక్ ఆశా బేగం, సరోజిని



**(షణ్ముఖ వెలుగు, పామూరు, మార్చి 08)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం భాగంగా మహిళల హక్కులు, సమానత్వం, సాధికారతపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించడమైంది. సీడీపీఓలు షేక్ ఆశా బేగం, సరోజినిలు మాట్లాడుతూ మహిళలపై వివక్షను తొలగించి సమాన హక్కులు కల్పించి సమాజ అభివృద్ధికి చాలా అవసరమని తెలిపారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలకు, ఏఎన్ఎం లకు, వివిధ రంగాలలో ప్రతిభ ఉన్న మహిళలకు స్త్రీ శక్తి పురస్కారాలు స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ అందజేయడం అందచేయడం ఎంతో గొప్ప విషయమని నాయబ్ రసూల్ స్వయంకృషి సేవా సంస్థను స్థాపించి విద్య కోసం, వైద్యం కోసం వృద్ధులు, ఒంటరి మహిళలకోసం, పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ పై అవగాహన కల్పించడం, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడం, బాల్య వివాహాల పై, బాలల హక్కులపై అవగాహన కల్పించడం వంటిఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని పలువురు ఆయన సేవలను కొనియాడారు. అన్నారు.ప్రత్యేకపోస్టర్ల ద్వారా మహిళల హక్కులు, మహిళా చట్టాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్,, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గల్లా చెన్నయ్య , మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు కావేరి రసూల్, అంగన్వాడి సూపర్వైజర్లు దేవకృపావరం, గోళ్ల .పద్మజ, ఎస్వీఎస్ పార్వతి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**
**వివిధ రంగాల మహిళలకు సత్కారం**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 08)**
కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఐసిడిఎస్, డిఆర్డిఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సదా గౌరవనీయులన్నారు. పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూ అన్నిరంగాలలో దూసుకు వెళుతున్నారు. మహిళలు స్వయం శక్తివంతులుగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోంది. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడటంతో పాటు, ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన డ్వాక్రా గ్రూపుల వ్యవస్థ రాష్ట్ర మహిళల దిశను మార్చేసింది. మహిళల వంటకష్టాలు చూడలేక దీపం పథకాన్ని ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి ఆయన అని ప్రశంసించారు. చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం, స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇవన్నీ ఈ ప్రభుత్వంలో మహిళలకోసం అందిస్తున్న పథకాలన్నారు. ఆడబిడ్డల చదువుల కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలు కొత్తగా అమల్లోకి వచ్చాయి. ఆడబిడ్డల సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించింది ఎక్కువగా మహిళలే. డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం కావాలన్నారు. కందుకూరు నియోజకవర్గంలో త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కాబోతోంది. యువతులు, మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. త్వరలో వివోఏలకు సెల్ ఫోన్లు, ఏపీఎంలకు ల్యాప్ టాప్ లు ఇవ్వబోతున్నామన్నారు. 18 సంవత్సరాల లోపు యువతులకు వివాహాలు చేయవద్దు. వారిని చక్కగా చదువుకోనివ్వండి. కందుకూరు నియోజకవర్గం పారిశ్రామిక కేంద్రంగా మారబోతోంది. త్వరలో వేల సంఖ్యలో ఉద్యోగాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ దేశంలోని ఐఏఎస్‌లలో 40 శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. మన రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు పనితీరుకు దేశంలోనే గుర్తింపు ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకొని, మహిళలు మరింత బలమైన శక్తిగా ఎదగాలని సబ్ కలెక్టర్ ఆకాంక్షించారు. అంతకుముందు సబ్ కలెక్టర్ హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష, ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ ఇంద్రాణి తదితరులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా 1683 స్వయం సహాయక సంఘాలకు, 238 కోట్ల రుణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళా మణులను ఘనంగా సత్కరించడంతోపాటు, మెమెంటోలు అందజేశారు. వేడుకలకు హాజరైన మహిళలందరికీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఉచితంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, మెప్మా సీఎంఎం ఫణికుమారి,





## పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 08)**
ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో అధ్యక్షులు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదార్ వలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తాసిల్దారులు చంద్రావతి, సువర్ణ మాట్లాడుతూ స్త్రీ లేనిది ప్రపంచం లేదన్నారు. అలాంటి స్త్రీని ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. తదుపరి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మనోరమ తేజోవతి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. పలువురు రిటైర్డ్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, దాసరి గురుస్వామి, మోహన్‌రావు తోడ్పాటు అందించారు.

## మహిళా ఉపాధ్యాయులకు ఎస్‌టియు ఆధ్వర్యంలో ఘన సత్కారం

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 08)**



రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని మండలంలోని మహిళా ఉపాధ్యాయులకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ యొక్క కార్యక్రమానికి సభ అధ్యక్షులు మండల విద్యాశాఖ అధికారి ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని గృహిణిల ఉద్యోగ రాజకీయ శాస్త్ర సాంకేతిక విభాగాలలో నేడు మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశానాయక్ మాట్లాడుతూ మొదటి మహిళ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటేల్, భారతదేశ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది మర్మ అంతరిక్ష రంగంలో కల్పనా చావ్లా క్రీడా విభాగంలో కలెక్టర్లు గాను ఐపీఎస్ గాను అనేక మంది మహిళలు ముందుండి రాణిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు, మండల అధ్యక్షులు కే సామ్యూల్, గౌరవ అధ్యక్షులు జే వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండ నాయక్, జిల్లా కౌన్సిలర్ మురళి గోపాల్, ప్రధాన కార్యదర్శి డి తిరుపతి నాయక్, జీవీ నర్సయ్య, ఆంజనేయులు, మహిళా ఉపాధ్యాయులు ఇందిరా ప్రియదర్శిని, ఈశ్వరమ్మ, శ్రీదేవి, నాగలక్ష్మి, శిరీష, బాలమ్మ, సోనీ బాయి, అంజలి, లక్ష్మీ, కురిసిత్, బేగం, జమీల్, సుల్తానా, రజియా, రోషమ్మ, హెప్సిబా, వాణిబాయి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరిటౌన్, మార్చి 08)**
కూటమి ప్రభుత్వం ఎన్నికలవేళ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. శనివారం రాత్రి పిసి పల్లి మండలంలోని పెద్ద ఇర్లపాడు లో వివాహ కార్యక్రమానికి హాజరైన కదిరి బాబురావు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ,20 లక్షల ఉద్యోగాలు కల్పన వంటి పథకాలు ఇప్పటికీ అమలుకాలేదన్నారు. మహిళలకు ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి నగదును సక్రమంగా మహిళల బ్యాంకు ఖాతాలలో వేయడం లేదన్నారు. నేటికి వృద్ధులకు, వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయక పోవడం బాధాకరమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కదిరి బాబురావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పోలు జయరామి రెడ్డి, ముప్పూరి శ్రీనివాసులు, మడతల ఓబుల్ రెడ్డి, వైసీపి ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు లింగాలదిన్నె నరసింహారెడ్డి, అంద్రా వెంకటేశ్వర్లు, లింగాలదిన్నె మహేందర్ రెడ్డి, గోపిరెడ్డి రోశిరెడ్డి, బోగాల జయరాం, మాలియాద్రిరెడ్డి, బోగాల మనోజ్, లెక్కల చలమారెడ్డి, పెద్దిరెడ్డి ఓబుల్ కొండారెడ్డి, మందా మహేందర్‌రెడ్డి, సాయి కుమార్, నరేష్ సాంబయ్య, ప్రకాశం జిల్లా వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు పోలు వరలక్ష్మి, ఎరుకలరెడ్డి, ఉండేలా రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కంభంలో ముస్లిం యూత్ కమిటీ సేవా కార్యక్రమం

**65 మంది పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ**





**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 08)**
కంభం పట్టణంలో ముస్లిం యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ సందర్భంగా పేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. రంజాన్ పండుగను పేదలు కూడా ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 13 రకాల నిత్యావసర సరుకులతో ప్రత్యేకంగా కిట్లను తయారు చేసి మొత్తం 65 మంది పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. బియ్యం, పప్పులు, నూనె, చక్కెర, మసాలా దినుసులు తదితర అవసరమైన సరుకులను ఒక కిట్‌గా రూపొందించి అందజేశారు. పేదలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ముస్లిం యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. కిట్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేయడం ద్వారా వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ముస్లిం యూత్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యూత్ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 08)**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు యర్రగొండపాలెం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల యుటిఎఫ్ మహిళా కార్యదర్శి జే రజిని అధ్యక్షత వహించి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు హాజరై మహిళలు అన్ని రంగాల్లో రాణించి మహిళా అభివృద్ధికి తోడ్పడాలని బాల్య విహాలను అరికట్టడానికి కృషి చేయాలని బాలికల అక్షరాక్షతను పెంచాలని కోరారు. అలాగే యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పబ్బిశెట్టి రవికుమార్ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయుల హక్కుల కొరకు యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ ఎస్ నాయక్, డి మల్లికార్జునరెడ్డి, ఏ నాగయ్య, టి చెన్నయ్య, ఎంఈ హేమలత, టి సుజాత, కే పద్మావతి దేవి, రహమ్మద్ బి, బాలమణి, బాలి బాయ్, సోనీ బాయ్, సుమాంజలి, సక్రిబాయ్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ యర్రగొండపాలెంపాలెం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సీనియర్ మహిళా ఉపాధ్యాయులకు మండల యుటిఎఫ్ శాఖ వారు ఘనంగా సన్మానించడం జరిగింది.

# సమాజ అభివృద్ధికి మహిళలే మూల స్తంభాలు

# మున్సిపాలిటీ మహిళా కార్మికులకు ఘన సన్మానం

### మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి సుబ్బారావు, అవోపా సెక్రెటరీ సివి నాగేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 08)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం బద్వేల్ వార్త జాతీయ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ భూమిరెడ్డి వెంకటేష్, అర్బన్ రిపోర్టర్ వల్లం కొండు వెంకటరమణ, గోపవరం రిపోర్టర్ కట్టారు రామయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాథ వృద్ధులకు పలువురికి తినుబండారాలు, స్వీట్లు, పండ్లు వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వార్త సిఎండి డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ జన్మదినోత్సవం సందర్భంగా అక్కడ ప్రత్యేక కేక్ కట్ చేపించి పలువురు గిరీష్ కుమార్ సంగికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బద్వేల్ పట్టణంలోని వివిధ శాఖలలో పనిచేసే మహిళలందరికీ అలాగే మున్సిపాలిటీలో నిరంతరాయంగా పారిశుద్ధ సేవలు అందిస్తున్న మున్సిపల్ మహిళ కార్మికులందరికీ శాలవాలతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైనటువంటి సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రి ఈఎన్టి డాక్టర్ మహేష్, కెవి సుబ్బారావు, చాటకొశీదు నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, రమణతో పాటు పలువురు మాట్లాడుతూ



నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారు అన్నారు. సమాజాభివృద్ధికి మహిళలే మూల స్తంభాలని స్త్రీ లేకుంటే సృష్టే లేదన్నారు. స్త్రీ లేకుంటే జీవనమే లేదని స్త్రీ లేకుంటే ఈ ప్రపంచాన్ని ఊహించుకోలేము అన్నారు. అటువంటి స్త్రీ మూర్తుల గొప్పతనాన్ని వారి శక్తి సామర్థ్యాన్ని వారు త్యాగాన్ని మరువలేనివని అనంతరం రాష్ట్రవ్యాప్తంగా మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, సెక్రటరీ బొగ్గరపు వెంకటసుబ్బమ్మ, ఐవిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవతి లక్ష్మీదేవి,వనితా క్లబ్ జోన్ చైర్మన్ చింతకుంట ధనలక్ష్మి, వల్లశీ కొండు ధనలక్ష్మి, సచివాలయం అడ్మిన్ కౌసర్జహా,మహిళా పోలీస్ మీన, వల్లంకొండు ధనలక్ష్మి, ఆశ్రమం సెక్రటరీ పలువురు మహిళలకు శాలువాలతో సత్కరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. అలాగే ఆదివారం ఉదయం వార్త జాతీయ దినపత్రిక సీఎం డి గిరీష్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కోట సుమన్, డాక్టర్ వైవి సరస్వతిల సహకారంతో సుమారు 100 మందికి ఒక్కొక్కరికి (1900) విలువ చేసే పలు రకాల రక్త పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాగిమాను ప్రతాప్ కుమార్, హాస్పిటల్స్ సిబ్బంది మద్దూరు సుబ్బారాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ మద్దూరు చందు, గొంది సుస్మిత, వినయ్ పైడిమర్రి సురేష్ బాబు, సగల రాజ, కొలిశెట్టి చంద్ర గొల్లమందల వేణుగోపాల రామకృష్ణ, వల్లంకొండు రాఘవేంద్ర, పిడతల రవికుమార్, బండారు సురేష్‌బాబు, పత్తి హరీష్, కాలువ నాగేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

### మంత్రి గొట్టిపాటి రవికుమార్





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 08)

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. తొలుత పుట్టావారిపాలెం క్యాంపు కార్యాలయంలో 103 మందికి సీఎం సహాయనిధి చెక్కులు, 15 మందికి ఎల్‌ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే పరవమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంద్నారు. ఆపన్నులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంగా నిలుస్తోందని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1,000 కోట్లు పైగా సాయాన్ని ఇప్పటి వరకు పేదలకు అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ సాయాన్ని అందిస్తున్నాం తెలిపారు.

## పరిశుభ్రత కోసం శ్రమించే మహిళలకు ఘన సత్కారం

### మానవతా సేవా సంస్థ చైర్మన్ గుంటక వనజాక్షి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 08)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురం పట్టణంలో హృదయాన్ని హత్తుకునే సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఆదివారం మార్కాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న మహిళా శానిటరీ సిబ్బందికి చీరలు పంపిణీ చేసి ఘనంగా సత్కరించారు. సమాజ ఆరోగ్యానికి కీలకమైన పరిశుభ్రత బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఈ మహిళల సేవలను గుర్తించి వారికి గౌరవం తెలియజేయడం కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది.

ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ చైర్మన్ గుంటక వనజాక్షి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పరిశుభ్రత కోసం అహర్నిశలు కష్టపడుతున్న శానిటరీ సిబ్బంది సేవలు అమూల్యమని తెలిపారు. వారి సేవలకు గుర్తింపుగా మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు అందజేసి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, ట్రెజరర్ టి. శ్రీనివాసరావు, ఆర్.కే.జి నర్సింహం, మహిళా సభ్యులు కే. మల్లేశ్వరి, వి. భూలక్ష్మి, ఎన్. సుజాత, పి. స్వప్న తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు కూడా హాజరై మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. చీరలు అందుకున్న మహిళా శానిటరీ సిబ్బంది మానవతా సేవా సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రామిక మహిళల ఉపాధి హక్కుల కోసం పోరాడుదాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)




ఎన్నో పోరాటాలు త్యాగాలతో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం మార్చి 8ఉద్భవించిందని,మహిళలు పోరాడకుండా ఏ ఒక్క హక్కు సాధించబడలేదని చేసిన చట్టాల్ని కూడా అమలు చేయించుకోవాల్సిన దుస్థితి ఈ దేశంలో కొనసాగుతుందని ఈ స్థితిలో మహిళల హక్కులకై పోరాడాల్సిన కర్తవ్యం ఉందని పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ కృష్ణప్రియ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్లో శ్రామిక మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్ భారతి అధ్యక్షత వహించింది. ఈ సదస్సులో ప్రగతి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతర్జాతీయ శ్రామిక మహిళాదినాన్ని శ్రామిక మహిళల ఉపాధి పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ ఉపాధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి, దాని స్థానంలో పివిజీ రాంజీ పథకం తీసుకురావడంలో కుట్ర దాగి ఉందని,దీనికి కేటాయించాల్సిన నిధులు లో కోత విధిస్తున్నారని విమర్శించారు. పని హక్కు వలన మహాత్మా గాంధీ జాతి గ్రామీణ పథకం వలన దళితులు, ఆదివాసీలు, మహిళలు ఎక్కువ ప్రయోజనం పొందారని, ప్రభుత్వం తీసుకున్న ఈ వైఖరితో వారంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.అందుకే మహిళల ఉపాధి పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడాలని 117 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మహిళల హక్కుల కోసం జరిగే పోరాటాలలో శ్రామిక మహిళలు ముందు వరుసలో నిలబడాలన్నారు. పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వి మంజుల మాట్లాడుతూ కార్పొరేట్లకు కారు చౌకగా శ్రమను దారా దత్తం చేయడానికి ప్రభుత్వం కుట్ర పూనుకుందని అన్నారు. ఈ సదస్సుకు ముందు ప్రగతిశీల మహిళా సంఘం ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన ఒంగోలు అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి ప్రకాశం భవనం పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా శర్మ కాలేజీ దేవుడు చెరువు వరకు చేరుకున్నారు. ఈ సదస్సులో మహిళలని చైతన్య పరిచే గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ పద్మ, సుశీల, సంపూర్ణ, కోటేశ్వరమ్మ, వేణి, అమ్మాజీ, సుశీల, అరుణ, మానస, భారతి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 08)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని చాకిచెర్ల శ్రీశ్రీ నగర్‌లో ప్రేమ జ్యోతి మినిస్ట్రీ సంఘం ఆధ్వర్యంలో అంధ మహిళల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. అంధ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిడుగు జ్యోతి అధ్యక్షతన కార్యక్రమ నిర్వహించారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాపట్ల అన్నమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా గౌరీ, సహాయ కార్యదర్శి యేసు దయా, రాష్ట్ర ట్రెజరర్ ఎస్తేరు రాణి పాల్గొని దివ్యాంగుల సమస్యల గురించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ విశిష్టత గురించి ప్రసంగించారు. 60 మంది అంధ మహిళలు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా అంధ మహిళ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వృద్ధాప్య మహిళలు 20 మందికి, వారి యొక్క సంఘం ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. చాకిచెర్ల గ్రామానికి చెందిన సుదర్శి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమం నిర్వహణ చేయడం జరిగింది. కావలి రూరల్ బ్లైండ్స్ అధ్యక్షుడు రాజశేఖర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. చాకిచెర్ల స్థానిక ఉపాధ్యాయుడు భాస్కరరావు అంతర్జాతీయ మహిళా విశిష్టతను గురించి తెలియజేస్తూ దివ్యాంగ మహిళలు ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని మా గ్రామానికి రావటం గర్వకారణం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మరియమ్మ, రమాదేవి, రూపారాణి, సుదర్శి శ్రీనివాసులు, పాలరాజు, నాని, సతీష్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# దేశ ప్రగతికి మూలస్తంభం మహిళ

# ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు



మహిళలకు ఆదర్శం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము
మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించింది ఎన్టీఆర్
మహిళా ఆర్థిక ప్రగతే ఆశయంగా
ముందుకు వెళ్తున్న సీఎం చంద్రబాబు
మహిళలకు పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 08)

ఓర్పుకు, సహనానికి, త్యాగానికి, సేవకు ప్రతిరూపం మహిళలని, మహిళా అభివృద్ధి దేశ ప్రగతికి మూల స్తంభమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డు కన్వర్షన్ హాల్లో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ వేడుకలకు చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఆయన సతీమణి శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ లీలావతి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థకు, సృష్టికి మూలం మహిళలని, సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించేది మహిళలేనని కొనియాడారు. తాను ఇంతటి స్థాయికి ఎదిగి విజయాలు సాధించడానికి కారణం నా తల్లి అని, నా కుటుంబ యోగ క్షేమాలు, బాధితులను సమర్ధవంతంగా నిర్వహించడం వలనే నేను విజయాలు సాధించగలిగానని, కుటుంబ వ్యవస్థకు మూలం మహిళలని తెలిపారు. దేశంలో ప్రతి మహిళ తల్లిగా భార్యగా కుటుంబ బాధ్యతలు మోసే మహిళా శక్తిని వివరించారు. రాష్ట్రం, దేశ అభివృద్ధిలో నేడు మహిళల భాగస్వామ్యం, వారి త్యాగం మరోలెనిదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్ద పేట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. భారతదేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము దేశ మహిళ లోకానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆమె జీవితంలో ఎన్నో కష్టాలు, నష్టాలు, అవమానాలు చవిచూసి దేశ రాష్ట్రపతిగా ఎన్నో విజయాలు సాధించి దేశ నారీమణులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర హోం మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పదవులను సీఎం చంద్రబాబు మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, జాయింట్ కలెక్టర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అనేక సేవలందిస్తున్నారని వివరించారు. నేడు మహిళలు సమాజానికి అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించింది అన్న ఎన్టీ రామారావు అని, ఎన్టీఆర్ స్ఫూర్తితో మహిళల ఆర్థిక అభివృద్ధికి డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చింది సీఎం చంద్రబాబు నాయుడు అని తెలిపారు. అంతేకాకుండా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్త రావాలని ఆశయంతో నేడు సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు నడుస్తున్నారని తెలిపారు. ఆర్థిక ప్రగతి వెసులుబాటుకు కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు, ప్రతి పేద బిడ్డ చదువుకోవాలని తల్లికి వందనం ఇస్తూ మహిళా అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అలాగే మహిళా రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని వివరించారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా విద్యలో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత విద్యను అభ్యసించే వారికి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. చీఫ్ విప్ జీవీ సతీమణి శివశక్తి లీలా & అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ విజయాలు సాధిస్తున్నారన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళ నేడు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్ లతో పాటు అంతరిక్షంలో ప్రవేశించే స్థాయికి మహిళలు రాణించడం మనకెంతో గర్వకారణమన్నారు. కుటుంబ వ్యవస్థలో పిల్లలను బాల్య దశ నుండి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో మహిళల సేవలు ఎనలేనిమన్నారు. మహిళలు ఏ స్థాయిలో ఉన్న మన సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కమిషనర్ శివరాం ప్రసాద్, అధికారులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## వాసవి స్కూల్ నందు ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 08)

మార్కాపురం పట్టణంలో వాసవి స్కూల్ నందు ఘనంగా అంతర్జాతీయ మహిళ దీనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు కె రంగయ్య, ఏఓ కె రంజిత్, ఇంచార్జులు, ఉపాధ్యాయని బృందం, చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె రంగయ్య మాట్లాడుతూ మహిళ అంటే గౌరవం, అమ్మ ను మించి దైవం లేదు, సమాజంలో మహిళ పాత్రిచాలా కిలకమైనది అన్నారు. మహిళ అంటా సృష్టి అన్నారు. ఇది మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక విజయాలను వేడగా వేడుకునే రోజ, అంటే మహిళల సాధన, సమానత్యం. హక్కులను, గౌరవాన్ని, గుర్తింపును పెంపొందించడం అన్నారు. ఈ మహిళా దినోత్సవం 20వ శతాబ్దం ప్రారంభించే ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల నుండి ఉద్భవించిందన్నారు. ఇది ఐక్యరాజ్యసమితిచే గుర్తించబడిన అంతర్జాతీయ దినోత్సవమన్నారు. అలాగే నాడు చాలా గర్వంగా ఉంది, నా సంస్థతో ఎక్కవ శాతం మహిళలు ఉండటం సంతోషమన్నారు. అనంతరం మహిళలు ఇద్దరికి గౌరవంగా సన్మానం చేసి మహిళ టిచర్స్ అందరికి చిరు సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళాభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి

ఆడపడుచుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా
కూటమి ప్రభుత్వ ప్రోత్సాహకాలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)

మహిళాభ్యున్నతి పై ప్రత్యేక దృష్టి సారించి ఆడపడచుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. ఆదివారం ఉదయం ఒంగోలు నగరంలోని బృందావనం ఫంక్షన్ హాల్ నందు కూటమి ప్రభుత్వం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత మహిళలకు పలు రంగాల్లో ప్రత్యేక గుర్తింపు లభించిందని, నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిహక్కుతో పాటు రిజర్వేషన్ అవకాశాలు కల్పించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు పొదుపు లక్ష్మి గ్రూపుల పేరుతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చారన్నారు. పొదుపు మహిళలకు ఇచ్చే రుణాలను ప్రస్తుతం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు ఘనత కూడా చంద్రబాబుకు దక్కుతుందని తెలిపారు. తల్లికి వందనం ద్వారా రూ.10,090 కోట్లతో 67,27,164 మంది విద్యార్థుల తల్లుల ఖాతలలో ఆర్థిక సాయం చేశామన్నారు. స్త్రీ శక్తి ద్వారా ఏడాదికి రూ.2,963 కోట్లతో ప్రతి మహిళకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, దీని ద్వారా ఇప్పటి వరకు 50 కోట్ల ప్రయాణాలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల కుటుంబాలకు ఉచితంగా ఏడాదికి 3 సిలిండర్ల పంపిణీ, ఇప్పటివరకు 3.74 కోట్ల సిలిండర్ల పంపిణీ, మెగా డీఎస్సీ ద్వారా 7,955 మంది మహిళలకు టీచర్ ఉద్యోగాలు, మహిళా కానిస్టేబుళ్లుగా 993 మంది నేటి వరకు ఎంపిక జరిగిందని తెలిపారు. కేంద్రంతో కలిసి సర్వైకల్ క్యాన్సర్ నుండి ముందస్తు రక్షణగా బాలికలకు ఉచిత వ్యాక్సిన్ ఇస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా చెన్నై సేవాదళ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 08)

పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని తమిళనాడు సేవాదళ్ ఆధ్వర్యంలో సేవాదళ్ అధ్యక్షుడు హుస్సేన్ 120 ఇస్లామిక్ కుటుంబాలకు నిత్యవసర వస్తువులు బియ్యం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు, పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెన్నై రాష్ట్ర సేవల అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఒక్కరి కుటుంబాలలో ఆనందాలు వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో ఏర్పడిన నాటి ప్రభుత్వం ప్రతి పేద వాడి కుటుంబం ఆనందాలతో నింపిందన్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి తిరిగి రావడం అనంతరం ప్రతి పేదవాడికి మంచి జరగడం జరుగుతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డికి దేవుని దయ ప్రజలందరి దీవెనలతో తిరిగి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు క్రితిక, ప్రకాష్, కొండయ్య, శరవణన్, మాల్యత్రి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైసీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 08)

ఒంగోలు వైసీపీ పార్టీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త చుండూరి రవిబాబు, సిటీ ప్రెసిడెంట్ కటారి శంకర్, మహిళా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆటపాటలతో మహిళలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.





